క్లుప్తంగా

కేజీబీవీలో ఆరోగ్య పరీక్షలు


ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో రాష్ట్రీయ బాలల స్వస్థీయ కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థినులకు వైద్య బృందం ఆరోగ్య పరీక్షలను నిర్వహించింది. విద్యార్థినుల రక్త నమూనాలు సేకరించడం తోపాటు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డా. శ్రీకాంత్, డా. వివేకవర్ధిని, ఫార్మసిస్ట్ సరిత, ఏఎస్ఎం సువర్ణ, ఎల్‌టీ ప్రియాంక, ఎస్‌వో కవిత, ఏఎస్ఎం వెన్నెల పాల్గొన్నారు.

'హిందూ ధర్మాన్ని కాపాడండి'


ప్రవచనాలు చెబుతున్న బాలాజీ మహరాజ్ కేంద్రె

కెరమెరి: హిందువుగా పుట్టిన ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని కాపాడాలని హరిభక్త పరాయణ్ మహరాజ్ బాలాజీ కేంద్రె అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శివాలయంలో నిర్వహించిన సత్సంగ్ కార్యక్రమంలో భక్తులకు ప్రవచనాలిచ్చారు. ధర్మాన్ని కాపాడితే అది మనల్ని కాపాడుతుందన్నారు. భక్తి మార్గం వైపు పయనించి సత్య అసత్యాలను తెలుసుకోవాలన్నారు. ప్రతీరోజు 15 నిమిషాలు హనుమాన్ చాలీసా పఠనం చేయాలని పేర్కొన్నారు.

నిత్యావసరాల అందజేత


నిత్యావసరాలు అందజేస్తున్న డీఎస్పీ

వాంకిడి: మండలంలోని టోక్కిగూడ గ్రామానికి చెందిన రాజక్కకు వేట కోసం అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి తీవ్ర గాయాలు కాగా శుక్రవారం బాధిత కుటుంబాన్ని పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ వెంకటరమణ, సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి 30 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ పంటకు రక్షణగా విద్యుత్ తీగలు అమర్చడం ప్రమాదాలకు దారి తీస్తుందని, దీని వల్ల ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. అక్రమంగా విద్యుత్ తీగలు అమర్చడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు.

కౌటాల మాజీ సర్పంచ్‌పై కేసు నమోదు

కౌటాల: సిర్పూర్(టి) అటవీ రేంజ్ పరిధిలోని కౌటాల మండల కేంద్రానికి సమీపంలోని అటవీస్థలంలో మొరం తవ్వకాలు చేపట్టి అక్రమంగా ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఘటనలో కౌటాల తాజా మాజీ సర్పంచ్ వొజ్జల మౌనిశ్‌తో పాటు ట్రాక్టర్ యజమాని భీమయ్యపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సిర్పూర్(టి) ఫారెస్ట్ రేంజ్ అధికారి పూర్ణచందర్‌రావు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మొరం తరలించిన ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. అటవీప్రాంతంలోని మొరంను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేయాలని ఆయన హెచ్చరించారు.

7న రమాయి జయంతి

కౌటాల: మండల కేంద్రంలోని సదాశివపేట నలంద బుద్ధ విహార్‌లో ఈ నెల 7న మాత రమాయి 126వ జయంతి ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం స్థానిక బుద్ధవిహార్‌లో జయంతి పోస్టర్లను విడుదల చేశారు. గజానన్, వెంకటేశ్, రామయ్య, సందీప్, గోవింద్‌రావు, బండు రావు, హిరామన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో డీఈఈగా వెంకటేశ్వర్లు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో శుక్రవారం విద్యుత్‌శాఖ డీఈఈగా వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరించారు. ఆయన మంచిర్యాల నుంచి బదిలీపై జిల్లాకు వచ్చారు. ఇప్పటివరకు జిల్లాలో పనిచేసిన డీఈఈ ప్రసాద్ ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరు డీఈఈలను విద్యుత్ శాఖ 327 యూనియన్ ఆధ్వర్యంలో కార్యాలయంలో శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఉద్యోగులు రామకృష్ణ, సతీశ్, సల్మాన్, జంజిరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

'అక్రమ అరెస్టులు సరికాదు'

ఆసిఫాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లి పర్యటన పురస్కరించుకొని తుడుందెబ్బ నాయకులను ముందస్తు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం తనను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి సాయంత్రం విడుదల చేశారన్నారు.


జెండాలకు మొక్కుతున్న భక్తులు


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


డోలు, సన్నాయి వాయిస్తున్న కళాకారులు


సహపంక్తి భోజనం చేస్తున్న భక్తులు


నృత్యం చేస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో జంగుబాయికి పూజలు

కెరమెరి: ఆదివాసీల కొంగుబంగారం జంగుబాయికి కొలాం ఆదివాసీలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మండలంలోని ధనోరా గ్రామ సమీపంలో ఉన్న ఆలయంలో కొలువైన జంగుబాయికి ఉమ్మడి జిల్లాతో పాటు మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆత్రం గోత్రం వారు జంగుబాయిని కుల దైవంగా భావిస్తారు. కటోదాలు జెండాలు ఎగురవేశారు. పితృదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. చిన్నాపెద్దా తేడా లేకుండా మహిళలు ఆలయం ఎదుట డోలు, సన్నాయి వాయిద్యాలతో సంప్రదాయ నృత్యాలు చేశారు. మారు, భీంరావు, ధర్మూ, జైతు, తుకారాం, లక్ష్మణ్, భీంబాయి, రాజుబాయి, జైతుబాయి, పోసుబాయి తదితరులు ఉన్నారు.

'ప్రత్యేక' పాలన షురూ

- ముగిసిన సర్పంచుల పదవీకాలం
- బాధ్యతలు స్వీకరించిన అధికారులు
- జిల్లాకు 128 మంది ప్రత్యేకాధికారులు


కౌటాల: ముత్తంపేట్ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న నస్రుల్లాఖాన్

ఆసిఫాబాద్‌రూరల్: గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 335 గ్రామ పంచాయతీల్లో 128 మంది ప్రత్యేకాధికారులు బాధ్యతలు స్వీకరించారు. ఒక్కో ప్రత్యేకాధికారికి 2 నుంచి 4 గ్రామ పంచాయతీలను అప్పగించారు.

ఆసిఫాబాద్ మండలంలో..

మండలంలోని మొత్తం 26 గ్రామ పంచాయతీలకు 14 మంది ప్రత్యేకాధికారులను నియమించారు. అంకుసాపూర్, బాబాపూర్‌లకు తహసీల్దార్ రమేశ్, ఎల్లారం, మానిక్‌గూడ, అడ గ్రామాలకు ఎంపీడీవో శశికళ, మోతుగూడ, బూర్గుడలకు ఎంపీవో ప్రసాద్‌లను నియమించారు. పంచాయతీరాజ్ శాఖ ఏఈ రామ్ కిరణ్‌కు ఈదులవాడ, చక్రకుంట, సివిల్ సప్లయ్ డీటీ రాజ్ కుమార్‌కు మోవాడ్, వెంకటపూర్, సీడీపీవో సాదియాకు గోవింద్ పూర్, గుండి, వ్యవసాయ శాఖ ఏవో ఖాదర్ హుస్సేన్‌కు రహపల్లి, అప్పపల్లి, పశుసంవర్ధక శాఖ వీఎఎస్ మురళి కృష్ణకు చిర్రకుంట, పాడిబండ, హార్టికల్చర్ ఏవో నదీంకు వావుదాం, అడదస్నాపూర్, రెవెన్యూ డీటీ పోచ్చయ్యకు కౌటగూడ, తుంపెల్లి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్‌కు రౌట సంకెపల్లి, డీటీ సివిల్ సప్లయ్ శ్యాంలాల్‌కు చోర్‌పల్లి బాధ్యతలు అప్పగించారు.

దహెగాంలో..

దహెగాం: సర్పంచుల పదవీకాలం జనవరి 31తో ముగియడంతో ఫిబ్రవరి 2 నుంచి రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించింది. మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రత్యేకాధికారులు శుక్రవారం పంచాయతీ బాధ్యతలు స్వీకరించారు. దహెగాం పంచాయతీకి జిల్లా మత్స్యశాఖ అధికారి విజయ్‌కుమార్, ఇట్యాల, బొర్లకుంట, కోత్మీర్ పంచాయతీలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇనోస్, కమ్మర్‌పల్లి, పెసరికుంట జీపీలకు డీటీ లలిత, లగ్గాం, కుంచవెల్లి, పీపీరావు కాలనీలకు తహసీల్దార్ కవిత, హత్తిని, ఒడ్డుగూడ, బీబ్రాలకు పశువైద్యాధికారి శ్రావణ్‌కుమార్, దిగిడ, రాంపూర్, మొట్లగూడలకు మిషన్ భగీరథ ఏఈ గోపిచంద్, గిరవెల్లి, కర్జి, బామానగర్‌లకు ఏవో వంశీక్రిష్ణ, ఐనం, కల్వాడ, చౌకలకు ఎంపీవో రాజేశ్వర్‌గౌడ్, గెర్రె, చినరాస్పెల్లి, చంద్రపల్లిలకు పీఆర్ ఏఈ ఆత్మారాంలను ప్రత్యేకాధికారులుగా నియమించారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.


పెంచికల్‌పేట్: ఎల్కపల్లి పంచాయతీలో బాధ్యతలు స్వీకరిస్తున్న డీఈ రామ్మోహన్

ఎల్కపల్లి పంచాయతీలో డీఈ రామ్మోహన్, ఎల్లూర్, లోడుపల్లి, కొండపల్లి పంచాయతీల్లో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, బొంబాయిగూడ, కమ్మర్‌గాం, మురళీగూడ పంచాయతీల్లో ఎంపీడీవో గంగాసింగ్, చేడ్వాయి, పోతెపల్లి పంచాయతీల్లో మండల విద్యాధికారి రమేశ్‌బాబు, దరోగపల్లి, పెంచికల్‌పేట్, అగర్‌గూడ పంచాయతీల్లో ఆర్‌డబ్ల్యూ ఏఈఈ మనోహర్‌లు బాధ్యతలు స్వీకరించారు.

రెబ్బెనలో..

రెబ్బెన: సర్పంచుల పదవీకాలం ముగియటంతో శుక్రవారం నుంచి గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన మొదలైంది. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ఆయా పంచాయతీలకు కేటాయించిన ప్రత్యేకాధికారులు బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని గోలేటి, ఇందిరానగర్, కొండపల్లి పంచాయతీలకు ఎంపీడీవో శ్రీనివాస్, కిష్టాపూర్, జక్కులపెల్లి, కైరిగూడ, నారాయణపూర్‌లకు తహసీల్దార్ సమీర్, కైరిగాం, నవేగాం, వంకులం, రాంపూర్ పంచాయతీలకు ఎంపీవో అంజద్ పాషా, కొముర‌వెల్లి, పాశిగాం, గంగాపూర్ పంచాయతీలకు మండల వ్యవసాయాధికారి మంజుల, దర్మారం, నంబాల, రాజారం పంచాయతీలకు పంచాయతీరాజ్ ఏఈ గౌస్‌మోయినోద్దీన్, రెబ్బెన పంచాయతీలకు పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్, పులికుంట, రోళ్లపాడు, తక్కళపల్లి పంచాయతీలకు ఇరిగేషన్ ఏఈ షేక్ జానీ, లక్ష్మీపూర్, మాద్వాయిగూడ, తుంగెడ పంచాయతీలకు ప్రత్యే


దహెగాంలో ప్రత్యేకాధికారి విజయ్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న పంచాయతీ కార్యదర్శి

కాధికారిగా డిప్యూటీ తహసీల్దార్ వరలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: మండలంలో శుక్రవారం మండల, గ్రామపంచాయతీల ప్రత్యేకాధికారులు బాధ్యతలు స్వీకరించారు. గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ గురువారం ఆదేశాలు జారీ అయ్యాయి. మండల ప్రత్యేక అధికారిగా కుటుంబరావు, చింతలమానెపల్లి, బాబాపూర్, బాబాసాగర్, బూరెపల్లి, రవీంద్రనగర్1, రవీంద్రనగర్ 2 గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారిగా ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, బాలాజీ అనుకోడ, డబ్బా, గంగాపూర్, లంబాడిహేటి గ్రామపంచాయతీలకు డిప్యూటీ తహసీల్దార్ ముష్కూర్ అలీ, దిందా, గూడెం, ఖర్జెల్లి, రణవెల్లి, రుద్రాపూర్ గ్రామపంచాయతీలకు తహసీల్దార్ నాగరాజ్‌గౌడ్, అడెపెల్లి, హేటిగూడ, కోర్సిని, కోయపెల్లి గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారిగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉదయ్‌వీర్‌లను నియమించారు.

కౌటాలలో..

కౌటాల: గ్రామ పంచాయతీలకు అధికారులు ప్రత్యేకాధికారులను నియమించడంతో శుక్రవారం ఆయా పంచాయతీ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని ముత్తంపేట్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో నస్రుల్లా ఖాన్, నాగేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకాధికారిగా మౌనిక బాధ్యతలు స్వీకరించారు.

సులభ్ కాంప్లెక్స్‌లు మంజూరు చేయండి


వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పడిన మున్సిపల్ పరిధిలో సులభ్ కాంప్లెక్స్‌లను మంజూరు చేయాలని, కూరగాయల మార్కెట్ పరిధిలో నిర్మించిన నూతన కాంప్లెక్స్‌ను ప్రారంభించాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం కమిషనర్ అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి, వర్గ సభ్యులు దినకర్ మాట్లాడుతూ మేజర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినా అధికారులు సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మించలేదని విమర్శించారు. దీంతో జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పట్టణంలోని రహదారులను నిబంధనల ప్రకారం విస్తరించాలని కోరారు. కొందరు ఇంటి యజమానులు రోడ్డు పైవరకు ర్యాంపుల నిర్మాణం చేపడుతున్నారని, దీంతో ఇరుకు రోడ్లతో ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. జుబ్లీ మార్కెట్‌కు వెళ్లేందుకు సరైన రహదారులు నిర్మించాలని పేర్కొన్నారు. నాయకులు గొడిసెల కార్తీక్, జిల్లా కమిటీ సభ్యులు ఉన్నారు.

ఉచిత శిక్షణతో మహిళలు స్వశక్తిగా ఎదగాలి


శిక్షణ ప్రారంభిస్తున్న నళిని నరేందర్

రెబ్బెన: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతులు, మహిళలకు అందిస్తున్న స్వయం ఉపాధి ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకొని స్వశక్తితో ఎదగాలని సేవాసమితి బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షురాలు నళిని నరేందర్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి సేవా సమితి భవనంలో శుక్రవారం బ్యూటీషియన్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ స్వయం ఉపాధి అవకాశాలను కల్పించటంతో సింగరేణి సంస్థ ఎంతో ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. సింగరేణి ఉద్యోగులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు, సింగరేణి ప్రభావిత ప్రాంతాల నిర్వాసితులకు సైతం అనేక సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. నిరుద్యోగ మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న జూట్‌బ్యాగుల తయారీ, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, డ్రైవింగ్ శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్వోటూజీఎం మచ్చగిరి నరేందర్, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి ఉపాధ్యక్షులు బయ్య మొగిళి, పర్సనల్ మేనేజర్ తిరుపతి, సీనియర్ సేవా సభ్యులు కుందారపు శంకరమ్మ, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, కోఆర్డినేటర్ అంజయ్య పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు


రెబ్బెన: సభకు తరలివెళ్తున్న నాయకులు

రెబ్బెన: ఇంద్రవెల్లిలో శుక్రవారం నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు మండలం నుంచి భారీగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. గ్రామాల నుంచి తరలివచ్చిన కార్యకర్తలు మండల కేంద్రం నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులో ఇంద్రవెల్లికి తరలివెళ్లారు. ఇంద్రవెల్లిలోని అమరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్, నాయకులు సుదర్శన్‌గౌడ్, చిరంజీవిగౌడ్, వెంకటేశ్వర్‌గౌడ్, కిషన్‌గౌడ్, సురేందర్ రాజు, రాజాగౌడ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

కెరమెరి: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలో శుక్రవారం జరిగిన సీఎం సభకు కెరమెరి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు బయలుదేరి వెళ్లారు. నాయకులు సుదర్శన్, బాబు, గిడ్డప్ప, బాపూరావు, అబ్బాస్, రౌఫ్ తదితరులు ఉన్నారు.

అనుమతులు లేకుండా నీటి తరలింపు


ట్యాంకర్‌లో నీళ్లు నింపుతున్న డ్రైవర్

రెబ్బెన: మండల కేంద్రంలోని నూతన పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న రెబ్బెన గ్రామ పంచాయతీకి చెందిన బోరు నుంచి రైల్వే కాంట్రాక్టర్ ఎలాంటి అనుమతులు లేకుండానే దర్జాగా ట్యాంకర్లలో నీటిని తరలిస్తున్నారు. ప్రజల నీటి అవసరాల కోసం ఉపయోగించాల్సిన బోర్‌మోటర్‌ను కాంట్రాక్టర్ తన ఇష్టారీతిగా వినియోగిస్తున్నా పంచాయతీ అధికారులు మామూలుగా తీసుకుంటున్నారు. దాంతో పంచాయతీపై కరెంట్ బిల్లు రూపంలో అదనపు భారం పడుతోంది. జాతీయ రహదారి పక్కనే ఉన్న బోరు మోటర్ దుర్వినియోగం అవుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి రవీందర్‌ను వివరణ కోరగా పంచాయతీ బోర్ నుంచి కాంట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా నీటిని తరలిస్తున్నట్లు తమ దృష్టికి రాలేదన్నారు. విచారించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


కొలతలు తీస్తున్న మైనింగ్ ఏడీ నాగరాజు

రెబ్బెన: మైనింగ్ నియమ నిబంధనలకు అనుగుణంగానే సుద్ద తవ్వకాలు చేపట్టాలని నిబంధనలు అతిక్రమించి తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని గనులు, భూగర్భ శాఖ ఏడీ నాగరాజు సూచించారు. రెబ్బెన మండలంలోని రాళ్లపేట, రాంపూర్ శివారుల్లో కొనసాగుతున్న సుద్ద క్వారీలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా మైనింగ్ లీజు పొందిన వ్యక్తులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే తవ్వకాలు చేపట్టాలని సూచించారు. తవ్వకాలు పూర్తయిన ప్రాంతంలో లీజు అగ్రిమెంట్‌లో పొందుపర్చిన విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా తవ్వకాలు చేపట్టిన ప్రాంతాల్లో కొలతలు చేపట్టారు. మైనింగ్ పనుల మూలంగా ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. సుద్ద తవ్వకాలు చేపట్టిన ప్రాంతంలో పెద్ద గోతులు లేకుండా చూడాలని, తవ్వకాలు పూర్తయిన ప్రాంతంలో చదును చేసి మొక్కలు నాటాలన్నారు. లీజు సమయంలో ప్రభుత్వం సూచించిన అన్ని రకాల జాగ్రత్తలు చేపట్టాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఆర్‌ఐ చంద్రకళ, సర్వేయర్ వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు సత్యశోధక వివాహాలు

కెరమెరి: మహాత్మ జ్యోతిబా పూలే ఆశయ సాధన కోసమే సత్యశోధక వివాహాలు జరిపిస్తున్నామని మాలీ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెట్కూలే సుకుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని బారేమోడి గ్రామంలో పూలే దంపతుల విగ్రహ ప్రతిష్టాపనకు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం 'సత్యశోధక వివాహ పద్ధతి' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మాలీలతో పాటు బహుజనుల కులాలు పూలే ఆశయాలకు అనుగుణంగా, మాలి సమాజ నియమాలకు అనుగుణంగా వివాహాలు జరుపుకోవాలన్నారు. మాలీ సంఘం మండలాధ్యక్షుడు కావుడే తులసీరాం, నాయకులు శ్యాంరావు, మనోహర్, శ్రావణ్, శంకర్, తదితరులు ఉన్నారు.

గడల్‌పల్లిలో జాతర ఏర్పాట్లు పరిశీలన


జాతర ఏర్పాట్లు పరిశీలిస్తున్న నిర్వాహకులు

తిర్యాణి: మండలంలోని గడల్‌పల్లి గ్రామపంచాయతీ పవన్ మడుగు పుణ్యక్షేత్రంలో ఈ నెల 6, 7వ తేదీల్లో నిర్వహించే పాహుండి కుపార్ లింగో జాతరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మేరకు శుక్రవారం సర్పంచుల సంఘం అధ్యక్షుడు గుణవంత్‌రావు జాతర స్థలాన్ని పరిశీలించి సింగరేణి అధికారులతో చర్చించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు, గ్రామస్తులు కుర్సంగె మోతిరాం, సీడం కేశవ్‌రావు, కోట్నాక బాదిరావు, మడావి నర్సింగ్‌రావు, మడావి మారుతి, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: తిర్యాణి మండలంలోని గడల్‌పల్లిలో ఈ నెల 7 నుంచి ప్రారంభమయ్యే 'పాహుండి కుపార్ లింగో' జెండావిష్కరణ కరపత్రాలను శుక్రవారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఆదివాసీలకు ఎంతో పవిత్రమైన దేవుడు పాహుండి కుపార్ లింగో అని, భక్తిశ్రద్ధలతో పూజిస్తే సకల కార్యాలు నెరవెరుతాయని విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి భరత్ అన్నారు. కార్యక్రమానికి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఆదివాసీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రఘునాథ్, జగనాథ్‌రావు, ఆనంద్‌రావు, తుకారాం, లింగు తదితరులు ఉన్నారు.

'ఎన్‌హెచ్‌ఎం' ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పని చేస్తున్న ప్రతీ క్యాడర్ ఉద్యోగిని రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో డీఎంహెచ్‌వో తుకారాంను శుక్రవారం కలిసి సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ 20 ఏళ్లుగా ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న చేపట్టిన సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. డీఎంహెచ్‌వోకు సమ్మె నోటీసు అందించారు. దివాకర్, మధుకర్, రజిత, ముస్తక్, మాయ, గంగుబాయి, చంద్రకళ, వెంకటేశ్, లింగమ్మ పాల్గొన్నారు.

పట్టణ సీఐగా శంకరయ్య బాధ్యతల స్వీకరణ


స్వాగతం పలుకుతున్న పోలీసులు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణ నూతన సీఐగా శంకరయ్య శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన బుద్దె స్వామిని రామగుండం కమిషనరేట్‌కు బదిలీ చేయగా, ఆయన స్థానంలో శంకరయ్య ఇక్కడికి వచ్చారు. ఖమ్మం జిల్లాలో సేవలు అందించిన శంకరయ్యను కాగజ్‌నగర్ పట్టణ సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో శుక్రవారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించగా, పట్టణ ఎస్సైలు, ఏఎస్సైలు, పోలీసు సిబ్బంది స్వాగతం పలికారు. ఈసందర్భంగా సీఐ శంకరయ్య మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానన్నారు. అనంతరం కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్‌ను సీఐ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న ఫొటో, వీడియోగ్రాఫర్లు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఓల్డ్‌కాలనీకి చెందిన వీడియోగ్రాఫర్ సాయి మంచిర్యాల నుంచి కాగజ్‌నగర్ వస్తుండగా మోటారుసైకిల్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. సాయి కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో కాగజ్‌నగర్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు విరాళాలు జమ చేసి రూ. 23వేలను శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో పట్టణ ఫొటో వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు.